

ట్రాఫిక్ పోలీసుల
పనితీరు ఇదేనా? 4లో

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -70 శుక్రవారం 16 మే 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కాళేశ్వరం ఆలయ పర్యాటక అభివృద్ధికి
# రూ.200 కోట్లు

## సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం
- సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి
- కాళేశ్వరం ఆలయ అభివృద్ధికి రేవంత్ రెడ్డి సంకల్పం
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళిక
- అభివృద్ధికి రూ.200 కోట్ల వరకు కేటాయింపు

**కాళేశ్వరం,మే15(జర్నలిస్ట్ వార్త):** కాళేశ్వరం ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలయ సమగ్రాభివృద్ధికి అవసరమైతే రూ.200 కోట్ల వరకు నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో భాగంగా నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. మిగతాది 2లో...



## రాష్ట్రపతి,గవర్నర్లను
# ఎలా ఆదేశిస్తారు?



- ఈ అధికారం మీకెవరిచ్చారు?
- రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?
- రాష్ట్రపతి,గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు
- తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం
- సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి
- ధర్మాసనం సమాధానం ఇస్తుందా అన్న ఉత్కంఠ

తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. 2లో.

# యాపిల్ కు ట్రంప్ మోకాలడ్డు

- భారత్‌లో యాపిల్ విస్తరణ వద్దని టిమ్‌కుక్‌కుచెప్పా
- అక్కడ ఐ ఫోన్ల తయారు చేయడంనాకు ఇష్టం లేదు
- భారత్‌లో వ్యాపారంకష్టమని చెప్పా
- దోహలోఅమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలనవ్యాఖ్యలు
- సున్నా సుంకాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న విదేశాంగశాఖ మంత్రి జైశంకర్



2లో.

## కంచెగచ్చిబౌలి భూముల్లో
# పర్యావరణం పునరుద్ధరించండి

- యధాతథ స్థితి కొనసాగించకుంటే జైలుకెళ్లక తప్పదు
- భూములపై మరోమారు విచారించిన సుప్రీం
- విచారణ జూలై 18కి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ,మే15(జర్నలిస్ట్ వార్త):** : హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. మిగతాది 2లో...



## అతివల పర్యటనపైనా
# రాజకీయమా

కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు
సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా
మండిపడ్డ మంత్రి సీతక్క



2లో.

# సిస్టం ఏం చేస్తోంది?

## ➤ వైద్యం పేరుతో జరుగుతున్న దోపిడిపై క్లారిటీ ఉందా?

- ➤ కార్పొరేట్ హాస్పిటల్స్ దోచుకుంటున్న సంగతి గమనించరా?
- ➤ కార్పొరేట్ హాస్పిటల్లో ఓపి తీసుకుంటే 5 వందలు
- ➤ పరీక్షలు పేరుతో మరోరకమైన భారం
- ➤ అడ్మిట్ చేసి ట్రీట్మెంట్ ఇస్తే అదోబారం
- ➤ అందులోనే మెడిసిన్ అధిక భారం
- ➤ఓపి, ఆపరేషన్, రక్త, మూత్ర పరీక్షలకు ధరలు ఎవరు నిర్ణయిస్తారు?
- ➤ అసలు ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణ ఆచరణలో ఉన్నాయా?
- ➤వైద్య వ్యవస్థలో దోచుకున్న వారికి దోచుకున్నంత
- ➤ ఇన్కమ్ టాక్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారా?
- ➤వ్యాపారంగా మారిన వైద్యం వైపు ప్రభుత్వం ఎందుకు చూడలేకపోతోంది?



3లో.

## 8వేల కోట్ల ఫీజు
# బకాయిలు

తక్షణమే చెల్లించి ఆదుకోండి
సిఎంకు బండి సంజయ్ లేఖ



2లో.

# రాష్ట్రపతి,గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు?

**న్యూఢిల్లీ,మే15(జర్నలిస్ట్ వార్త):** తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200 కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా?గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. వర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశిరచింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

------

# కాళేశ్వరం ఆలయ పర్యాటక అభివృద్ధికి రూ.200 కోట్లు

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సరస్వతీ పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగాన్ని అభినందించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మొట్టమొదటిసారిగా టెంట్ సిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.త్వరలోనే గోదావరి, కృష్ణా పుష్కరాలు రానున్నాయని తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహించే అదృష్టం తనకు కలగనుందని అన్నారు. కాళేశ్వరం క్షేత్ర వైభవాన్ని మరింత ఇనుమడింపజేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పునరుద్ఘాటించారు.

కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుం. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నకి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోం. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ న పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు- పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు- చేశారు.

# యాపిల్‌కు ట్రంప్ మోకాలడ్డు

**భారత్‌లో యాపిల్ విస్తరణ వద్దని టిమ్‌కుక్‌కుచెప్పా**

**అక్కడ ఐ ఫోన్లు తయారు చేయడంనాకు ఇష్టం లేదు**

**భారత్‌లో వ్యాపారంకష్టమని చెప్పా**

**దోహాలోఅమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలనవ్యాఖ్యలు**

**సున్నా సుంకాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న**

**విదేశాంగశాఖ మంత్రి జైశంకర్**




**న్యూఢిల్లీమే15(జర్నలిస్ట్ వార్త):**
భారతదేశంలో యాపిల్ ఉత్పత్తులను విస్తరించవద్దని ఆసంస్థ సిఈఓ టి మ్ కుక్ కు తాను చెప్పినట్లు అమెరికా ప్రె సిడెంట్ డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దో హాలో ఒక బిజినెస్ కార్యక్రమంలో పా ల్గొ న్న ట్రంప్ యాపిల్ సిఈఓ టిమ్ కుక్ ను కలిసినప్పుడు ఆ సంస్థ భారతదేశం అం తటా తన ఉత్పత్తులను విస్తరించే ఆలోచన ఉన్నట్లు తెలిసిందని, అయితే భారతదేశంలో యాపిల్ విస్తరించాలని తాను కోరుకోవడం లేదని ఆయన కు చెప్పినట్లు ట్రం ప్ వివరించారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాలలో భారతదేశం ఒకటి అనీ, అందువల్ల భారతదేశంలో అమెరికన్ ఉత్పత్తులు అమ్మ డం చాలా కష్టమని ట్రంప్ అన్నారు. యాపిల్ సంస్థ చైనాలో ఎన్నో ప్లాంట్లను నిర్మించినా తాము సహించామని, భారతదేశంలో యాపిల్ ప్లాంట్లు నిర్మించడం తమ కు ఇష్టంలేదని, భారతదేశం తన అభివృద్ధిని తా నే చేసుకుంటుందని టిమ్ కుక్‌కు వివరించినట్లు ట్రంప్ వివరించారు. సి ఈఓ తో తన సంభాషణ తర్వాత అమెరికాలో యాపిల్ తన ఉత్పత్తిని పెంచనున్నట్లు ట్రంప్ చెప్పారు.తన చర్చల త ర్వాత భారతదేశంలో ఆపిల్ ప్రణాళికల్లో ఏమై నా మార్పు లు ఉంటాయా అన్న అంశాన్ని మా త్రం ట్రంప్ వివరించలేదు. భారత ఉక్కు, అల్యూమినియం ఎగుమతులపై అమెరికా సుంకాలను పెం చినందుకు ప్రతి స్పందనగా అమెరికాపై ప్ర తీకార సుంకాలను విధిస్తామని భారతదేశం హె చ్చరించిన కొద్దిరోజుల తర్వాత ట్రంప్ ఈ రకమై న వ్యా ఖ్యలు చేశారు.ఈ మధ్య కొన్ని ఉద్రిక్తతలు ఎదురైనప్పటికీ, భారత్ %- % అమెరికా మధ్య వాణి జ్య చర్చ లు ఇంకా కొనసాగుతున్నాయి. రెండు దేశా లు ఒప్పందాలను కుదుర్చుకునే దిశగా కృషి చేస్తున్నాయి.మరో విశేషం ఏమిటంటే.. దోహాలో అదే ప్రసంగంలో ట్రంప్ అమెరికా వస్తువులపై సుంకాలను తొలగించే ప్రతిపాదనను భారతదేశం అందించినట్లు ట్రంప్ ప్రకటించారు.ఆపిల్ కొన్ని ఏళ్లుగా భారతదేశంలో తమ తయారీ ప్రక్రియను క్రమం గా పెంచుతోంది. ఫాక్స్ కాన్ , విస్ట్రాన్ వంటి కాం టాక్ట్ తయారీదారుల ద్వారా కంపెనీ దేశంలో అ నేక ఐఫోన్ మోడళ్లను తయారు చేస్తోంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం అనే భారత విధానాలకు అనుగుణంగా ఈ ప్రయత్నాలు చేస్తున్నది.

**సున్నా సుంకంపై నిర్ణయం తీసుకోలేదు**

అమెరికా ఉత్పత్తులపై జీరో టారిఫ్ ఆఫర్‌పై ఇం కా ఏమీ నిర్ణయం కాలేదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేసారు.అమెరికాతో వాణి జ్య చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఆ చ ర్చలలో తుది నిర్ణయం జరగలేదని ఆయన అ న్నా రు. చర్చలలో చాలా చిక్కుముడులు ఉన్నాయ ని, ప్రతి అంశం పై నిర్ణయం జరిగేవరకూ ఏమీ చె ప్పలేమని, ఏదైనా వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్ర యోజనకరంగా ఉండాలని, అప్పుడే ఉభయ దే శాలకు ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి అ న్నారు. వాణిజ్య ఒప్పందం విషయంలో భారతదే శం అదే కోరుతున్నట్లు మీడియాకు తెలిపారు. ట్రంప్ దోహాలో మాట్లాడుతూ భారతదేశం అమెరికాకు సున్నా సుంకాలతో వాణిజ్య ఒప్పందాన్ని అందించిందని ప్రకటించిన కొద్ది సేపటికే జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

**(మొదటి పేజీ తరువాయి)**
కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా
వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు-, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ- సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

# అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

## కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

## సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా

## మండిపడ్డ మంత్రి సీతక్క



**ములుగు,మే15(జర్నలిస్ట్ వార్త):**
మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్స్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు. అబద్దాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు. అధికారం పోయాక.. ప్రజలు, ఆత్మగౌరవం మీకు గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు.

----------

# 8వేల కోట్ల ఫీజు బకాయిలు

## తక్షణమే చెల్లించి ఆదుకోండి

## సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్,మే15(జర్నలిస్ట్ వార్త):** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ. 8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు- కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్లుతున్నాయని అన్నారు.

అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

జర్నలిస్ట్ వార్త

శుక్రవారం 16 మే 2025

# సిస్టం ఏం చేస్తోంది?

- సొసైటీలో ఏం జరుగుతుందో తెలుసా?
- వైద్యం పేరుతో జరుగుతున్న దోపిడిపై క్లారిటీ ఉందా?
- కార్పొరేట్ హాస్పిటల్స్ దోచుకుంటున్న సంగతి గమనించరా?
- కార్పొరేట్ హాస్పిటల్లో ఓపి తీసుకుంటే 5 వందలు
- పరీక్షలు పేరుతో మరోరకమైన భారం
- అడ్మిట్ చేసి ట్రీట్మెంట్ ఇస్తే అదోబారం
- అందులోనే మెడిసిన్ అధిక భారం
- ఓపి, ఆపరేషన్, రక్త, మూత్ర పరీక్షలకు ధరలు ఎవరు నిర్ణయిస్తారు?
- అసలు ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణ ఆచరణలో ఉన్నాయా?
- వైద్య వ్యవస్థలో దోచుకున్న వారికి దోచుకున్నంత
- ఇన్కమ్ టాక్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారా?
- వ్యాపారంగా మారిన వైద్యం వైపు ప్రభుత్వం ఎందుకు చూడలేకపోతోంది?






**వరంగల్/మే 15(జర్నలిస్ట్ వార్త):** వైద్యం పేరుతో వ్యాపారం చేస్తూ వైద్య విధానం కొనసాగుతుందనడానికి ఆశ్చర్యం లేదు. ఏదైనా అనారోగ్య సమస్యతో కార్పొరేట్ హాస్పిటల్ ఆశ్రయించారంటే ఇక అంతే సంగతులు. నిలుచున్నచోటే నిలువు దోపిడీ చేస్తారనడానికి అతిశయోక్తి లేదు. ప్రస్తుతం అన్నింటికంటే ఎక్కువ ఆర్థిక నష్టం జరుగుతుందంటే కేవలం వైద్యం సందర్భంలోనే అన్న సంగతి తెలిసిందే. 2 లక్షల రూపాయల వేతనం కలిగిన ఉద్యోగులైన సరే, 200 రూపాయల కూలివారైనా సరే ఎవ్వరు ప్రభుత్వ హాస్పిటల్స్ వైపు మొగ్గు చూపడం లేదు. ఎక్కువగా ప్రైవేట్ హాస్పిటల్స్ మాత్రమే ఆశ్రయిస్తున్నారు. అందుకు నిదర్శనంగా వరంగల్ జిల్లాలో వందల సంఖ్యలో ప్రైవేటు హాస్పిటల్స్ ఏర్పడ్డాయి. వాటికి సంబంధించిన ప్రచారం వివిధ రకాలుగా కొనసాగిస్తూనే ఉన్నారు. కొంతమంది డాక్టర్లు తమ హాస్పిటల్ ప్రచారం చేసుకోవడానికి అక్కడ ఇక్కడ మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజల్ని ఆకర్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి కొంతమంది హాస్పిటల్ యాజమాన్యం సాధారణంగా కార్లలో ఎఫ్ఎం ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. ఇంకా మరి కొంతమంది విషయానికి వస్తే పాంప్లెట్స్ వివిధ రకాలుగా ప్రజలకు చేరువయ్యేలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అంతర్గత రహస్యమేమిటంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్లను అడప్ చేసుకుని వారి ద్వారా బాధితులను తమ హాస్పిటల్ సంప్రదించేలా తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా బాధితుల వద్ద వసూలు చేసిన పాపములో ఆర్ఎంపీలకు భాగం ఇవ్వడం కారణంగా అనేకులు కార్పోరేట్ హాస్పిటల్స్ ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. ఎవ్వరి ఇష్టానికి వారు వైద్య వ్యవస్థను వ్యాపారంగా మార్చుకుని, లక్షల నుంచి కోట్ల రూపాయలు ఘటిస్తున్నారు. వచ్చిన అనారోగ్య సమస్యకు నెలసరి వేతనం పొందుతున్న ఉద్యోగి చికిత్స చేయించుకోవడం పట్ల ఆర్థికంగా పెద్ద నష్టమేమీ ఉండదు. రోజువారి కూలీగా 200 రూపాయలకు చెమటోడ్చి పనిచేస్తున్న కూలీలకు ఆ చికిత్స పొందడం సాధ్యమయ్యే పనేనా? కార్పొరేట్ హాస్పిటల్ ఓపి 500 రూపాయలు, అదనంగా రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, ఈసీజీ, ఎక్రేలు, స్కానింగ్ లు, డిజిటల్ స్కానింగ్స్ ఇలా రకరకాల వైద్య పరీక్షలు చేస్తూ, వేల రూపాయలను దోచేస్తున్నారు. అనంతరం వివిధ రకాల పరీక్షలు నిర్వహించడంతో భయాందోళనకు గురైన బాధితున్ని అడ్మిట్ కావాలని వైద్యులు చెప్పడంతో బాధితులు అడ్మిట్ అవుతున్నారు. ఒక్కరోజు బెడ్ చార్జీ, ట్రీట్మెంట్, మెడిసిన్, హాస్పిటల్ జీఎస్టి తో సహా చార్జ్ చేస్తున్నారు. మరికొన్ని హాస్పిటల్లో ఫోన్ పే గూగుల్ పే కారణంగా జీఎస్టీ పడుతుందని ముందస్తుగా ఊహించి, హ్యాండ్ పేమెంట్ మాత్రమే తీసుకుంటున్నారు. ఇలా ఇన్ని రకాలుగా ఒక్క వ్యాధితో ఓ వ్యక్తి ఆశ్రయిస్తే తనను లూటీ చేస్తున్నారు.

## ధరలు నిర్ణయించేది ఎవరు?

ఒక హాస్పిటల్ ఏర్పాటు చేయాలంటే ఎలాంటి ప్రభుత్వ అనుమతులు పొంది ఉండాలి? హాస్పిటల్లో ఎన్ని రకాల వైద్య సేవలు ఉంటాయో? వాటికి సంబంధించిన డాక్టర్లు అర్హులైన వారే ఉండాలా? వద్దా? ఓపి ద్వారా 500 రూపాయలు తీసుకోవడం అంటే, వివిధ పరీక్షలకు ధరల నిర్ణయం, వైద్యానికి సంబంధించి ఇంతే ధరలు చెల్లించాలని ఎవరు నిర్ణయించేది? ఇలాంటి అనేక సందేహాలు సమాజంలో ప్రతి ఒక్కరికి ఉన్నప్పటికీ ఏమీ చేయలేని పరిస్థితి చోటుచేసుకుంది. కార్పొరేట్ హాస్పిటల్ లో వైద్యుడిని నేరుగా కలిసే అవకాశం లేక పోతుంది. చార్జి చేస్తున్న విషయమై సామాన్యులకు ప్రశ్నించే ప్రసక్తే లేకుండా అందులో ఉన్న సిబ్బందితో బయటకు తోసేస్తారు. ఇలాంటి అనేక అనుమానాలకు సమాధానం ఎవరిస్తారు? సిస్టం ఏం చేస్తోంది? ప్రజలను వైద్యం పేరుతో నిలువునా దోచేస్తూ, అష్ట కష్టాలకు గురి చేస్తున్న వైద్య వ్యాపారస్తులపై ఎలాంటి చర్యలకు పాల్పడకుండా, ప్రభుత్వం ఏం చేస్తోందని బాధిత వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. సమాజంలో అత్యవసరమైన అవసరాలు వైద్యం, విద్య ఈ రెండు అవకాశాలు ప్రతి ఒక్కరి జీవితంలో నరకయాతనను చూపిస్తున్నాయి. వైద్యం కావాలంటే లక్షల్లో ధనం ఉండాల్సిందే. విద్య కావాలన్నా లక్షల్లో మాటే అలాంటప్పుడు లక్షల రూపాయలు సామాన్యుడికి ఎలా సాధ్యమౌతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చదువుకోవాలని ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు ఎదురై ఎందరో మేధావులు కాలగర్భంలో కలిసిపోతున్నారు. సమాజాన్ని వైద్యం, విద్య పేరుతో పట్టిపీడిస్తున్న వ్యాపారస్తులపై చూసి చూడనట్లు ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తోందని వరంగల్ జిల్లా ప్రజలు విమర్శ చేస్తున్నారు. సామాన్యులకు వైద్యం విద్య అందుకోలేని పరిస్థితిలో అందని ద్రాక్షలా మిగిలిపోయినప్పుడు సామాన్యులకు చావే శరణ్యమా? ఏం చేయాలి? అనే ప్రశ్నలు వరంగల్ జిల్లాలో అతలాకుతలం చేస్తున్నాయి.

## ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణ ఆచరణలో ఉందా?

ప్రైవేట్ హాస్పిటల్స్ వైపు ప్రజలు మొగ్గుచూపుతూ లక్షల రూపాయలు అప్పులు తీసుకువచ్చి తగలేడుతూ అనారోగ్య సమస్యలపై చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణ అసలు ఆచరణలో ఉందా? అనే సందేహాలకు వారి నిర్వహణ తాగిస్తోంది. ప్రభుత్వ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం, అడ్వాన్స్ టెక్నాలజీ మెటీరియల్ లేకపోవడం కారణంగా ప్రభుత్వ హాస్పిటల్ వెళ్లిన ప్రయోజనం ఉండడం లేదని వాదన వినిపిస్తుంది. అక్కడకు వెళ్లిన ప్రైవేట్ హాస్పిటల్ వెళ్లాల్సిన పరిస్థితిలు చోటు చేసుకుంటున్నాయి. స్కానింగ్, ఎక్రే, డిజిటల్ స్కానింగ్, వివిధ రక్త, మూత్ర పరీక్షలు అవసరం ఉన్న లేకపోయినా వరంగల్ హనుమకొండ నగరాల్లోని డయాగ్నస్టిక్ సెంటర్స్ పంపిస్తున్నారన్న వాదన ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ హాస్పిటల్స్ నిర్వహణపై, వైద్యం పేరుతో వ్యాపారం చేస్తున్న ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్స్, ఆర్ఎంపీ వ్యవస్థ చేస్తున్న మధ్య దళారి హైడ్రామా పై ప్రభుత్వానికి ఏమైనా క్లారిటీ ఉందా? లేకపోతే స్థానికంగా పనిచేస్తున్న అధికార యంత్రాంగం ఏం చేస్తోందని బాధిత వర్గాలు నిలదీస్తున్నాయి. ప్రజా సంరక్షణ కోసం ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంటే, విద్యా, వైద్యం పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నప్పటికీ కార్పొరేట్ వ్యవస్థలకు ఆద్యం పోసినట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ప్రభుత్వ శైలిని ప్రజలు విమర్శిస్తున్నారు.

## ఇన్కమ్ టాక్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారా?

ప్రైవేట్ హాస్పిటల్స్ నిర్వహణలో జరుగుతున్న వ్యవహారాలపై ఇన్కమ్ టాక్స్ అధికారులు, సంబంధిత వివిధ శాఖల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా? లేదా? అన్న అనుమానాలు వరంగల్ మహానగరంలో ప్రచారంగా మారాయి. కార్పొరేట్ హాస్పిటల్స్ ఆదాయం సాధారణంగా లెక్కవేసి చూస్తే కళ్ళు చెదిరిపోయేలా ఇన్కమ్ పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. ఉదాహరణకు ఒక్క కార్పొరేట్ హాస్పిటల్ కి వివిధ రోగాల సమస్యలతో వైద్య పరీక్షలు, సేవల కోసం దాదాపు ఒకరోజు 100 మంది హాస్పిటల్ ఆశ్రయిస్తే ఓపి ద్వారా వచ్చే ఆదాయం 50 వేల రూపాయల పైచిలుకు వస్తోంది. అదృష్టం బాగుండి ఆర్ఎంపీలు ఎక్కువగా ప్రోత్సహిస్తే 200 మంది వచ్చినట్లయితే లక్ష రూపాయలు కేవలం ఓపి ద్వారానే దోపిడి చేస్తున్నారు. ఏంటండీ? మీకున్న సమస్య ఏంటి? అని అడగడానికే 500 రూపాయలు ఇదేమి విచిత్రమో. ఇలా లెక్కలు చేసుకుంటూ పోతే ఒక్క హాస్పిటల్ ఆదాయాన్ని లెక్కించాలంటే ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మరి ఇన్కమ్ టాక్స్ అధికారులు, వివిధ శాఖల అధికారులు హాస్పిటల్స్ పై తనిఖీలు చేపడుతున్నారా? ఒకవేళ చేపడితే వారి ఆదాయం ఏ స్థాయిలో ఉందో? హాస్పిటల్ ధరలు ఎవరు నిర్ణయిస్తారో? అన్న విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజాభిప్రాయం వ్యక్తం అవుతుంది.



# సూరినేని విజయ్ రావు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.

### -బిర్రు మహేందర్ మాదిగ

**పర్వటగిరి/మే15(జర్నలిస్ట్ వార్త):**దళిత మహిళను కులం పేరుతో దూషించిన సూరినేని విజయ్ రావు పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మరియు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దళిత మహిళను కులం పేరుతో దూషించిన విషయంపై గురువారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జ్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ సభ్యులు బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ గత నెల 30 వ తారీకు రోజున కల్లెడ గ్రామానికి చెందిన వేల్పుగొండ స్వరూప భర్త పేరు కుమారస్వామి మాదిగ కులానికి



చెందినది ఆమె పశువుల కొరకు మడికట్టుకు వెళ్లి సందడి అంతా గడ్డి తీసుకొని వస్తుంటే ఆ పొలం యజమానుడు సూరినేని విజయ రావు గారు వచ్చే వచ్చుడు తోనే సదర్ మహిళా అని చూడకుండా మాదిగ లంజముండ అని బూతు పదాలతో చెప్పరాని మాటలతో ఇష్టం వచ్చిన రీతిగా తిడుతూ కొట్టడానికి పోవడం జరిగింది అంతలోనే సదర్ దళిత మహిళ భయపడి ఇంటికి వచ్చి తన భర్తతో కలిసి సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది వెంటనే పోలీస్ అధికారులు ఫీల్డ్ మీదికి వచ్చి ఎంక్వయిరీ చేయగా తిట్టింది వాస్తవమేనని సాక్షాలు కూడా చెప్పడం జరిగింది సాక్ష్యం చెప్పిన నేటికీ రెండు వారాలు అయినప్పటికీ సూరినేని విజయ రావు పైన కేసు నమోదు చేయకుండా పట్టించుకోకుండా వదిలేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఏసిపి, సిఐ, ఎస్సై లు దళిత మహిళ పైన కులం పేరుతో దూషించి అసభ్య పదజాలాలు వాడిన సూరినేని విజయరావు పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండలంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంల్లో ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ధర్మయ్య మాదిగ దాసరి లక్ష్మయ్య మాదిగ తక్కలపల్లి కుమారస్వామి మాదిగ వేల్పుగొండ కుమారస్వామి మాదిగ బాధితురాలు వేల్పుకుండా స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకుల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరణ

### - హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య




**హనుమకొండ/మే 15(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం మైనార్టీ గురుకుల పాఠశాలల అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్ హనుమకొండ కలెక్టర్ పి. ప్రావిణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ, తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. హనుమకొండ జిల్లాలో మొత్తం మూడు బాలుర గురుకుల పాఠశాలలు, ఒక బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎండబ్ల్యూఓ మురళీధర్ రెడ్డి, ఆర్ఎల్సీ శ్రీనివాస్ తనుగుల, గురుకుల ప్రిన్సిపాల్స్ సతీష్, నీరజ, శిరీష పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన నెంబర్ 7331170790

# ట్రాఫిక్ పోలీసుల పనితీరు ఇదేనా?

**- ట్రైసిటీ పరిధిలో ప్రాణాలపై ఎవరికి తీపి లేదు - హెల్మెట్ లేకుండానే ఇష్టానికి తిరుగుతున్నారు**








**వరంగల్/మే 15(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ హనుమకొండ కాజీపేట ట్రైసిటీ పరిధిలో వాహనదారులు ఎవరి ఇష్టానికి వారు తిరుగుతున్నారు. బాధ్యతలు నిర్వర్తించాల్సిన ట్రాఫిక్ పోలీసులేమో వారికి కేటాయించబడిన స్థలంలో లేకపోవడం విశేషం. ఇదే అదునుగా తీసుకున్న ద్విచక్ర వాహనదారులు వెహికల్ నడుపుతూ ఫోన్ మాట్లాడుతున్నారు. మరి కొంతమంది ఫోన్ ఆపరేట్ చేస్తూ అటు రోడ్డును, ఇటు ఇతర ప్రయాణికులను గమనించకుండానే ప్రయాణం చేస్తున్నారు. ఎంకి పెండ్లి సుబ్బి చావుకి వచ్చిందన్నట్లుగా ఒకరి నిర్లక్ష్యానికి మరొకరు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం సంభవిస్తే ఏం బాగుంటుంది. నిర్లక్ష్యం గా నడుపుతున్న వాహనదారుల ఇళ్లల్లో కుటుంబ సభ్యులు లేరా? ఎవ్వరు లేకుండా ఒక్కరు మాత్రమే ఉండడం వల్ల జీవితంపై విరక్తి కలిగి ఇలాంటి ప్రయాణం చేస్తున్నారా? ప్రాణాలపై ఇంత నిర్లక్ష్యం ఎందుకు? అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ మాట్లాడాల్సిన అవసరం వచ్చినప్పుడు నడుపుతున్న ఏ వాహనమైన ఒక ప్రక్కకు ఆపుకొని సురక్షిత ప్రాంతంలో వాహనాన్ని నిలిపి ఫోన్ పూర్తిగా మాట్లాడిన తర్వాతే తిరిగి ప్రయాణం కొనసాగించాలన్న ఆలోచన విధానం ఇంకా ఎంత కాలానికి వస్తుంది. సాధారణంగా తీసుకొని నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపైకి వస్తే ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణం అవ్వడమా? లేక వారే ప్రాణాలు కోల్పోవడం ఏదో ఒకటి జరగడం ఖాయం. ఇప్పటికైనా బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించకుండా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పోలీసులు బాధ్యతలు నిర్వర్తిస్తూ, హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ద్విచక్ర వాహనదారులను హెచ్చరించాలని, వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడుతున్న వారికి కచ్చితంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ మధ్యన ట్రాఫిక్ పోలీసులు ఎక్కువ ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. అందువల్లే వాహనదారులకు ఈ మధ్యన భయం లేకుండా పోయింది. అందువల్లే ఇలాంటి పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫోన్ మాట్లాడడం సాధారణమే అయినప్పటికీ దృష్టి మాత్రం వాహనదారుల నిర్లక్ష్యంపై ఉండేలా ట్రాఫిక్ పోలీసులు పట్టింపు చేయాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

# అండర్-23 క్రికెట్ సెలెక్షన్స్ ప్రారంభించిన వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





**వరంగల్/మే 15(జర్నలిస్ట్ వార్త):** కరుణాపురంలోని వంగపల్లి క్రికెట్ మైదానంలో 2 రోజులపాటు జరుగుతున్న క్రికెట్ సెలెక్షన్స్ గురువారం వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అందరి అభినందనలు తెలిపారు. గ్రామీణ జిల్లా క్రికెటర్లను వెలుగులోకి తెచ్చేందుకు జూన్ నెల మొదటి వారంలో జరిగే అండర్ 25 ఇంటర్ డిస్ట్రిక్ట్ లీగ్ లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక చేసే క్రమంలో నిర్వహిస్తున్న వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్ 6 జిల్లాల మధ్య జరిగే ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు పాత్ర కీలక పాత్రగా మరబోతుందని తెలిపారు. అందులో భాగంగా అతి త్వరలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో క్రికెట్ స్టేడియం స్థల సేకరణకోసం సిఎంతో స్వయంగా మాట్లాడటం జరిగిందని తెలిపారు. వరంగల్ క్రికెట్ క్రీడాకారులు, రంజీ, ఐపీఎల్, ఇండియా జట్టుకి ఎంపిక కావాలన్నారు. అందుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపికైన ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి 6 జట్లను, మూడు టర్ఫ్ వికెట్ క్రీడామైదనాలైన వరంగల్ జిల్లాలోని మొగిలి చర్ల, హన్మకొండలోని రెడ్డిపురం, జనగాం జిల్లాలోని వంగపల్లి క్రికెట్ టర్ఫ్ క్రీడా మైదానంలో 5 రోజుల పాటు లీగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుండి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక చేసి అండర్ 25 టూ - డే లీగ్ పోటీలకి పంపించనున్నామని అన్నారు. 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ ఎంపికలకి సెలెక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ వ్యవహరించగా, సెలెక్టర్ కమిటీ మెంబెర్స్ అఫ్జల్, పవన్, జిల్లా సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షులు తోట రాము, కుమార్, కోచ్ గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణలు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచుతాయి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**
- **అధునాతన బోధన ఉపాధ్యాయుల లక్షణంగా ఉండాలి**
- **ఉపాధ్యాయులు ఎప్పుడూ ముందుచూపుతో వ్యవహరించాలి**
- **21వ, శతాబ్దపు నైపుణ్యాలను ఉపాధ్యాయులు కలిగి ఉండాలి**
- **విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడానికి ఉపాధ్యాయుల కృషి చేయాలి**
- **ఉపాధ్యాయుల శిక్షణలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**హనుమకొండ/మే 15(జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో జరుగుతున్నటువంటి ఉపాధ్యాయుల శిక్షణలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం సందర్శించి ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. శిక్షణలు ఏ విధంగా జరుగుతున్నాయో జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న వివిధ సబ్జెక్టులలో శిక్షణ పొందుతున్నటువంటి ఉపాధ్యాయుల సమావేశపు హాలులలోకి ప్రవేశించి ఉపాధ్యాయులతో ముచ్చటించారు. శిక్షణలు ఎలా ఉన్నాయి? ఇంకా ఏమైనా నూతన పద్ధతులు , నూతన విషయాల పట్ల శిక్షణ అవసరము ఉందాని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ అధునాతన బోధన పద్ధతులతో పాటు, 21వ శతాబ్దపు బోధన మెలకువలను కలిగి ఉండాలని, దానికోసము శిక్షణలు అవసరమని ఆమె తెలిపారు. ప్రభుత్వము బైలింగ్వల్ ద్విభాష పాఠ్యపుస్తకాలను అందిస్తుందని, వాటి యొక్క అవసరము ఎలా ఉందని , వాటి ఉపయోగం ఎలా ఉందని, ఆమె ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులలో ఆంగ్లం నైపుణ్యాలు పెంచాలని, తరగతి గదిని డిజిటలైజ్ చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థుల యొక్క ప్రవర్తనలను గమనించి, వారికి నైతిక విలువల పెంపు పట్ల అవగాహన కల్పించాలని, మార్గదర్శనం చేయాలని ఆమె తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ను ఉపయోగించి బోధన చేయాలని, ఉపాధ్యాయులు బోధనోపకరణాలను వాడటం ద్వారా విద్యార్థుల యొక్క అభ్యసనము సులువు అవుతుందని ఆమె తెలిపారు. గత మూడు రోజులుగా స్కిల్ స్టార్ కు ఇంటర్నేషనల్ పాఠశాలలో జరుగుతున్నటువంటి శిక్షణలలో సుమారు 470 మంది ఉపాధ్యాయులు గణితము, ఆంగ్లము ,సాంఘిక శాస్త్రము, ఉర్దూ ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, మండల స్థాయి రిసోర్స్ పర్సన్ లకు శిక్షణ కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి, గుణాత్మక విద్య సమన్వయకులు ఏ. శ్రీనివాస్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి, సెంటర్ ఇన్చార్జిల, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

# సంస్థాగత ఎన్నికల సమావేశంలో పాల్గొన్న వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





**స్టేషన్ ఘనపూర్/మే 15(జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన రఘునాథ్ పల్లి మండలం, నిడిగొండ గ్రామం సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా జనగాం జిల్లా పిసిసి పరిశీలకులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, లింగం యాదవ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ రియాజ్ అహ్మద్, హనుమకొండ జిల్లా పిసిసి పరిశీలకులు కోటంరెడ్డి వినయ్ రెడ్డి, మక్సుద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**పంట మార్పిడి విధానం పాటించాలి**



**ధర్మసాగర్/మే15 (జర్నలిస్ట్ వార్త):** సాగు విధానంలో ప్రతి ఒక్క రైతు పంట మార్పిడి విధానం పాటించాలని రైతుల వద్దకు శాస్త్రవేత్తలు వస్తున్నారని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయలు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని, రసాయనిక మందులను అవసరం ఉన్నంతవరకే వాడాలని, అలాగే నీటి జాగ్రత్తగా వాడుకోవాలని, పంటమార్పిడి విధానాన్ని పాటించాలని తెలిపారు. అలాగే డాక్టర్ విశ్వతేజ మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదును భద్రపరచుకోవాలని గుర్తు చేశారు. అలాగే చెట్లను నాటాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. అలాగే మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ మాట్లాడుతూ మండలంలోని రైతులు అంతా తప్పకుండా జాతీయ రైతు గుర్తింపు కార్డుల కోసమై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీమతి జయశ్రీ, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పవన్, పూజితా తో పాటు అభ్యుదయ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారు.

# జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేయాలి

**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**





**సత్తుపల్లి/మే15(జర్నలిస్ట్ వార్త):** జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, అధికారులతో కలిసి వేంసూరు నుండి ధాంసలాపురం వరకు ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే గుండా ప్రయాణిస్తూ, క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే జిల్లాలో 3 ప్యాకేజులుగా విభజించి పనులు పురోగతి లో ఉన్నాయన్నారు. పనులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి, సమస్యలు గురించి తెలుసుకోవడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. జులై 15 కల్లా పూర్తిస్థాయిలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. ప్యాజేజి-1 క్రింద తల్లంపాడు నుండి సోమవరం వరకు 30 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం రూ. 772.11 కోట్ల అంచనాలతో చేపట్టగా, 75 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఇట్టి ప్యాకేజీలో 32 స్ట్రక్చర్లు ఉండగా, 29 పూర్తయ్యాయని తెలిపారు. ధాంసలాపురం వద్ద ఎన్ఎస్పి కాల్వలో పిల్లర్ల విషయమై అలైన్మెంట్ లో కాస్త ఆలస్యం అవగా, ప్రస్తుతం పనులు వడివడిగా సాగుతున్నాయన్నారు. ప్యాకేజి-2 క్రింద సోమవరం నుండి చింతగూడెం వరకు 27 కి.మీ. మేర రూ. 637.11 కోట్ల అంచనాలతో పనులు చేపట్టినట్లు, ఇప్పటివరకు 81 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇట్టి ప్యాకేజీలో 39 స్ట్రక్చర్లకు గాను 35 నిర్మాణాలు పూర్తయినట్లు ఆయన అన్నారు. ప్యాకేజి-3 క్రింద చింతగూడెం నుండి రేచర్ల వరకు 38 కి.మీ. మేర రూ. 804.69 కోట్ల వ్యయ అంచనాలతో పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 85 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఈ ప్యాకేజి కి సంబంధించి 55 స్ట్రక్చర్లు ఉండగా, 51 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. పనుల పురోగతికి ఎటువంటి సమస్యలు లేవని, అన్ని ప్యాకేజీలలో పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీస్ రోడ్ విషయమై ప్రతిపాదనలు సమర్పించి, మంజూరు చేయిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాంత మంత వ్యవసాయ ప్రాంతం కావున, సర్వీస్ రోడ్ చాలా అవసరమని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే లో సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 3 ఎక్జిట్లు ఉన్నాయని, దేశంలోని ఏ రాష్ట్రంలోని నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే లో 3 ఎక్జిట్లు లేవని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే, ప్రయాణ సమయం ఎంతో ఆదా అవుతుందని, రవాణా వ్యవస్థ మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, నేషనల్ హైవే పిడి దివ్య, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO: TELTEL/2023/87607

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయ్యాలి




**తల్లాడ/మే15(జర్నలిస్ట్ వార్త):**మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయ్యాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం తల్లాడ స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో బిజెపియేతర అఖిలపక్ష రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న అఖిలపక్ష రైతు సంఘాలు కార్మిక సంఘాలు మహిళ సంఘాలు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని ఈ సమ్మెకు బిజెపి యేతర రాజకీయ పార్టీలన్నీ మద్దతు ఇచ్చాయని దేశంలో ఉన్నటువంటి 90 శాతం మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి సామ్రాజ్యవాద కార్పొరేట్ విధానాలకు అనుకూలంగా దేశ ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి కుల మతాల మధ్య చిచ్చు పెట్టి పరిపాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా తమ హక్కులను కాపాడుకోవటం కోసం సమ్మెలో పాల్గొని గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా నరేంద్ర మోడీకి బిజెపి ప్రభుత్వానికి దేశసార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు చలమాల విటల్ రావు టి యు సి ఐ జిల్లా నాయకులు డి శ్రీనివాసరావు షేక్ లాల్మియా రైతు సంఘం మండల అధ్యక్షులు కళ్యాణపు కృష్ణయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పులి కృష్ణయ్య సిఐటియు నాయకులు షేక్ మస్తాన్ చల్లా నాగేశ్వరరావు సత్తెనపల్లి నరేష్ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తాళ్ల రాణి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిర్ర లింగయ్య గుడిపల్లి కృష్ణయ్య గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు నరేష్ ముచ్చింతల ఎల్లారావు చాపల రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



# అంతర్గత రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

## - వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ/మే 15(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 10వ, డివిజన్ కాపువాడా పిటిసీ పాఠశాల ఆవరణలో 15వ, ఆర్థిక సంఘ నిధులు రూ: 25 లక్షలతో రోడ్డు పనులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తనాజీ వాకాడే తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలానిలో పర్యటించి, ప్రజల సమస్యలను పరిశీలించారు. శితిలావస్థలో ఉన్న పాత భవనాన్ని కూల్చి వేయాలని, అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రతి బస్తీ, కాలనీలను అన్ని విధాలుగా ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేస్తానని చెప్పారు. సైడ్ డ్రైన్, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు కుడా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ నాసిమ్ జాన్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, నాయకులు మామిడిశెట్టి సతీష్, పల్లం రమేష్, బొంత రామకృష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐడియా అదిరింది బాసు

## -ఇంటి వద్దకే టైలరింగ్ సేవలు



**ఏపీ/కృష్ణా/మే15(జర్నలిస్ట్ వార్త):** ప్రతి మనిషికి కష్టాలు, సమస్యలు సహజం. సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా కాస్తా మనసు పెడితే ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఇట్టే దొరుకుతుంది. అందుకు పెద్ద, పెద్ద చదువులు చదుకోవాల్సిన అవసరం లేదని గతంలో చాలా మంది నిరూపించారు. తాజాగా ఓ దర్జీ కూడా అదే బాటలో పయనించాడు. ప్రస్తుతం టైలరింగ్ వృత్తిలో అనేక మార్పులు వచ్చాయి. రెడీమేడ్ దుస్తువులు, డిజైనరీ బోటిక్స్ పుణ్యమా అని సాధారణ టైలర్లకు చేతినిండా పనిలేకుండా పోతోంది. దీంతో పూట గడవని స్థితిలోకి కొంతమంది టైలర్లు వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో కృష్ణా జిల్లాకు చెందిన టైలర్ షేక్ కాలేషా వినూత్నంగా ఆలోచించాడు. ప్రస్తుత రోజుల్లో అన్ని సేవలు ఇంటి వద్దకే రావటాన్ని గమనించి, టైలరింగ్ సేవలను కూడా ఇంటి వద్దకు తీసుకెళ్లాలని అనుకున్నాడు. మరీ ఆ వివరాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.కృష్ణాజిల్లా పెనమలూరు మండలం వణుకూరుకు చెందిన షేక్ కాలేషా టైలర్ వృతితో జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. తొలుత గ్రామంలో టైలరింగ్ దుకాణాన్ని నిర్వహించేవాడు. అయితే, కాలక్రమేణ షాపుకు ఆదరణ తగ్గిపోయింది. కొంత మంది బట్టలు కుట్టించుకున్నా ఇచ్చే మొత్తం కంటే, అప్పులు పెట్టేదే ఎక్కువైంది. దీంతో కుటుంబ జీవనం కష్టంగా మారింది. వేరే పని వెత్తుకుందామా అంటే. తెలిసింది టైలరింగ్ పని ఒక్కటే. టైలరింగ్ వృత్తి ద్వారానే ఏదో విధంగా ఆదాయం పెంచుకోవాలని భావించాడు. ఈ క్రమంలో మొబైల్ టైలరింగ్ ద్వారా ఉపాధి పొందాలనుకున్నాడు. ఈ ఆలోచనలో భాగంగా తొలుత ఓ రిక్షాను కొని దానికి కుట్టుమిషన్ను అనుసంధానించాడు. ఎక్కడికైనా తీసుకుని వెళ్లేందుకు అనుగుణంగా మార్పులు చేశారు. గ్రామంలో కాలనీల్లో తిరుగుతూ ఇంటి వద్దే పాత, చిరిగిన బట్టలు కుట్టడం ప్రారంభించాడు. ఈ సేవలకు మంచి ఆదరణ లభించటంతో.. టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి పొరుగుళ్లకు తన సేవలను విస్తరించుకున్నాడు. రోజుకో గ్రామం చొప్పున తిరుగుతూ ఉపాధి పొందుతున్నాడు. ప్రస్తుతం అవసరం ఉన్న వాళ్లు కాలేషాకు ఫోన్ చేసి మరీ పిలింపించుకుని బట్టలు కుట్టించుకుంటారు. షాపు నిర్వహించటం కన్నా మొబైల్ టైలరింగ్ సేవలతోనే లాభం ఉందని కాలేషా చెబుతున్నాడు.

# న్యాయమూర్తి కార్తీక రెడ్డి ని ఘనంగా సన్మానించిన మధిర బార్ అసోసియేషన్



**మధిర/మే15(జర్నలిస్ట్ వార్త):**మధిర కోర్టు నుండి బదిలీపై వనపర్తి కోర్టుకు వెళుతున్న న్యాయమూర్తి కార్తీక రెడ్డి ని గురువారం మధిర బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ రెడ్డి శ్రీమతి దీప్తి వేముల మాట్లాడుతూ కార్తీక్ రెడ్డి , మానవతా విలువలు ఉన్న ఉన్నతమైన వ్యక్తి అని ఎప్పుడు పేద బడుగు వర్గాల గురించి ఉన్నతంగా ఆలోచించి న్యాయం చేయాలనే తపన ఉన్నటువంటి వ్యక్తి అని ,కార్తీక్ రెడ్డి నాకు సోదరుడితో సమానం అని వ్యాఖ్యానిస్తూ, బార్ అసోసియేషన్ బెంచ్ కి సహకరించి న్యాయార్థులకు తక్షణమే కేసులు పరిష్కారం చేయడానికి తోడ్పడాలని ఈ సందర్భంగా తెలియజేశారు .ఈ కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న న్యాయమూర్తి శ్రీ టి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తి ఎవరైనా బార్ అసోసియేషన్ తో కలిసి జోడెద్ల లాగా ప్రయాణం చేస్తేనే న్యాయార్దులకు న్యాయం జరుగుతుందని అందుకు మధిరలో సహకరించిన న్యాయవాదులందరకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు సిబ్బంది పోలీసు సిబ్బంది ప్రాసిక్యూషన్ సహకారం వల్లనే న్యాయమూర్తిగా నేను రాణించగలిగానని వ్యాఖ్యానించారు .ఈ కార్యక్రమంలో ఏపీపీ జే భద్రయ్య ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి పుల్లారావు సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు ,వాసంశెట్టి కోటేశ్వరరావు ,టి కృష్ణారావు,చింతల గోపాల్ ,ఎస్ మోహన్ దాస్ ,దిరిసల జగన్మోహన్రావు ,దేవరపల్లి సుబ్రహ్మణ్యం,కట్టా పూర్ణచంద్రరావు కావూరి రమేష్ ,పల్లపోతుల కృష్ణారావు , టి వెంకట్రావు,నెల్లూరు రవి,గంధం శ్రీనివాసరావు,జే రమేష్, కోటా జ్ఞానేష్,ఎం సతీష్,కె విజయ్ కుమార్,పుట్టా శ్రీనివాస్, సునీత, సంధ్య,కోర్ట్ సూపరింటెండెంట్స్ సత్యనారాయణ, మల్లేశ్వరరావు, కోర్ట్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రజల రుణం, కార్యకర్తల కష్టాన్ని ఎన్నటికీ మర్చిపోను

## - కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా

## - 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కష్టపడ్డ వారికే పదవులు

## - వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట/మే 15(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఏబిఎస్ గార్డెన్స్ లో వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల డివిజన్ల నాయకులతో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అబ్జర్వర్ అమర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర, టేస్కబ్, వరంగల్ డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టుదలతో ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజల రుణం, కార్యకర్తల కష్టాన్ని మర్చిపోనని అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా కల్పించారు. నియోజకవర్గంలో రాబోయే కాంగ్రెస్ పార్టీ కమిటీ కమిట్మెంట్ తో పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. సమర్థ నాయకత్వం ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రజలకు కార్యకర్తలకు సేవ చేసే నాయకత్వాన్ని ఎంపిక చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదవి, ప్రజా ప్రతినిధి పదవి, పార్టీకి ప్రజలకు సేవ చేయాలని, బాధ్యతగా నిర్వహించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రూపులు పెట్టవద్దని ఆదేశించారు. కష్టపడ్డా కార్యకర్తకు పార్టీ గుర్తింపు లభిస్తుందని అన్నారు. 2017కు ముందు నుండి పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి బ్లాక్ అధ్యక్షులు, మండల, వార్డు, గ్రామ అధ్యక్షులుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా, బ్లాక్, మండల, డివిజన్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ



**రాయపర్తి/మే15(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని జెతురాం తండా బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నేతావత్ మన్సూర్ తండ్రి నేత తారాచంద్ ఇటీవల అనారోగ్యం తో మరణించగా గురువారం తారాచంద్ చిత్రపటానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జేతురాం తండ టిఆర్ఎస్ నాయకులు గుగులోత్ రూప్ల నాయక్ కాలు విరిగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, బద్దం వేణుగోపాల్ రెడ్డి, కొమ్ము రాజు, చందు రాము, ఉబ్బని సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష

## - హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలు - పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**హనుమకొండ/మే 15(జర్నలిస్ట్ వార్త):** యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్- 2025 నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో మే 25న, జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను 4141 మంది అభ్యర్థులు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు.

మొదటి సెషన్ పరీక్ష మే 25న, ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు, రెండో సెషన్ లో పరీక్ష మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకోవాలన్నారు. ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోని కి అనుమతించరని పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డు తో పాటు పెన్ను, పెన్సిల్ను వెంట తెచ్చుకోవాలన్నారు. చేతి గడియారాలు కూడా అనుమతించబడవని అన్నారు. యుపిఎస్సి ప్రిలిమినరీ పరీక్షలు ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉదయం 6 గంటల నుండి పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తను అందుబాటులో ఉంచి అవసరార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. యూపీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. పరీక్ష నిర్వహించే రోజున ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల నుండి ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, డీఈఓ వాసంతి, టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ మధుసూదన్ రావు, తహశీల్దార్లు, పరీక్షా కేంద్రాల సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నందమూరి రామకృష్ణ ను మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు



**ఖమ్మం మే/ 15 /జర్నలిస్టు వార్త**

కల్లూరు మండలం యజ్ఞ నారాయణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన అన్న నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కోసం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ ని గురువారం మర్యాదపూర్వకంగా తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం మర్యాదపూరంగా కలిసి బొక్కే ఇచ్చి శాలువాతో సత్కరించి ఘస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు కేతినేని హరీష్ గుత్త సీతయ్య వడ్డం విజయ్ మందడపు సుధాకర్ గుండె పిన్ని నాగేశ్వరరావు నల్లమల్ల రంజిత్ డివిఎస్ నారాయణతదితరులు కలిశారు.

# చిరుజీవికి ..దాత సాయం

**- ఆపదలో ఆదుకున్న చిన్న పిల్లల వైద్యులు. -పెద్ద మనస్సుతో సాయం అందించిన చలసాని ఝాన్సీ**

**ఖమ్మం/మే15(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం ముస్తఫా నగర్ లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ రఫీకి ఇద్దరు సంతానం. ఒక కుమార్తె , కుమారుడు ఉన్నారు. కుమారుడు మహ్మద్ అయాన్ కు చిన్ననాటి నుంచి గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. వయస్సు పెరిగిన తర్వాత గుండెకు శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందని డాక్టర్లు తెలిపారు. అయాన్ ప్రస్తుతం మూడేళ్ల వయస్సుకు వచ్చాడు. అతనికి శస్త్రచికిత్స అత్యవసరమని హైదరాబాద్ కు చెందిన ప్రముఖ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అందుకు గాను రూ.4 లక్షల వరకు వైద్య ఖర్చు అవుతుందని తెలిపారు. హోం గార్డుగా విధులు నిర్వర్తించే రఫీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో దాతల సాయం కోరాడు. ప్రముఖ న్యూస్ ఛానల్ లో పని చేస్తున్న ఖదీర్ ని ఆశ్రయించాడు. ఖదీర్ కు ఆప్తమిత్రులైన చిన్న పిల్లల వైద్యులు డా. కూరపాటి ప్రదీప్ కుమార్ , డా. కేవి కృష్ణారావు ను సంప్రదించాడు. డా. కేవి కృష్ణ రావు హైదరాబాద్ లోని వైద్యులతో మాట్లాడి ఫీజు , ట్రీట్మెంట్ విషయంలో చొరవ తీసుకున్నారు. డా.




కూరపాటి ప్రదీప్ కుమార్ కు కుటుంబ సంబంధాలు కలిగిన చలసాని ఝాన్సీ కుమార్తె -అల్లుడు వంశీ -సుప్రజల ద్వారా చిరంజీవి అయాన్ కు జరిగిన గుండె శస్త్ర చికిత్సకు లక్ష రూపాయల సాయం



అందించి, అయాన ను దీవించారు. మనిషి మనిషికి ఉపయోగ పడాలని ఝాన్సీ అభిప్రాయ పడ్డారు. పక్షులు , జంతువులు తమ జాతికి సహాయం చేసుకుంటున్నట్లుగా , మానవ జాతి పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. వైద్యులు , జర్నలిస్టు సమక్షంలో లక్ష రూపాయల నగదును మహ్మద్ అయాన్ తండ్రి మహ్మద్ రఫీకి అందించారు. ఈ కార్యక్రమంలో డా. కూరపాటి ప్రదీప్ కుమార్ , డా. కేవి కృష్ణారావు , జర్నలిస్ట్ ఖదీర్ , చలసాని ఝాన్సీ , మంగా తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబాని పరామర్శించిన బి ఆర్ ఎస్ నాయకులు



**వర్ధన్నపేట/మె15(జర్నలిస్ట్ వార్త):**వర్ధన్నపేట మండలం దివిటిపేల్లి గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త కూనూర్ రాజు అనారోగ్యంతో మృతి చెందాగా గురువారం వర్ధన్నపేట బి ఆర్ ఎస్ నాయకులు మృతుని కుటుంబాని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు భౌతిక దేహాన్ని సందర్శించి పూలమాలు వేసి నివాళులు అర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తుళ్ల. కుమార స్వామి మాజీ ఎంపీపీ అన్నం నేను అప్పారావు,మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి,గ్రామ సర్పంచ్ బుంగ ప్రవీణ్ లత,గ్రామ ఇంచార్జ్ సిల్వర్ కుమార స్వామి,గ్రామ ప్రధాన కార్యదర్శి కందిక.సారయ్య, సీనియర్ నాయకులు పిట్టల రాజు,కూనూర్ జగన్,రాజ గోపాల్ రెడ్డి,పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు అన్యాయం

**-కాంగ్రెస్ నేతలకే ఇందిరమ్మ ఇండ్లు**

**-బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు**




**వైరా/మే15(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలో భాగంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తోందని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు విమర్శించారు. గురువారం ఆయన ఓ ప్రకటన ద్వారా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో కాంగ్రెస్ నేతలు, ఇందిరమ్మ కమిటి సభ్యులు ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని అన్నారు. గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించకుండా ఇష్టానుసారంగా పేర్లను సిఫార్సు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు వారి అనుచరులకే, ఇదివరకే ఇండ్లు ఉన్న లబ్దిదారులను పథకానికి అర్హులుగా ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. అర్హులకు అన్యాయం చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులను గుర్తించకుండా. అన్యాయానికి పాల్పడితే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తామని అన్నారు. గ్రామ సభలు నిర్వహించి నిజమైన లబ్దిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకంలో కూడా సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన వారికి సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇందులో ఏదైనా అవక తవకలకు పాల్పడితే బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## సోషల్ మీడియా శీను మరణం తీరని లోటు



**పర్వతగిరి/మే15(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన పర్వతగిరి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కట్ట శ్రీనివాస్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పీసీసీ మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ అన్నారు. గురువారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీను మరణం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సౌరం ప్రభాకర్, సౌరం అభిలాష్, పులిచేరి రాధాకృష్ణ, కోగిల సుధాకర్, వడ్లకొండ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ అత్తి రేవతి కుమార్, సోమారం గ్రామం మాజీ ఎంపీటీసీ లచ్చునాయక్, పర్వతగిరి మండల ఎస్సి సెల్ అధ్యక్షులు నరుకుడు రవీందర్ పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ వారిచే వారి కాళ్లు కడిగించడం కాంగ్రెస్ పార్టీ సిగ్గుమాలిన చర్య

**-మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్**






**వర్ధన్నపేట/మే15(జర్నలిస్ట్ వార్త):**ఎస్సీ ఎస్టీ వారిచే వారి కాళ్లు కడిగించడం కాంగ్రెస్ పార్టీ సిగ్గుమాలిన చర్య అని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ఎస్ సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ అందాల పోటీల్లో పాల్గొంటున్న వారి పర్యటన కోసం పేద ప్రజల పొట్టకూడుతూ, చిరు వ్యాపార సముదాయాలను కలచేస్తుందని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు తొందరలోనే ఉండన్నారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొంటున్న వారి కాళ్ళను దళితులైన ఎస్సీ /ఎస్టీ వారిచే వారి కాళ్లు కడిగించడం కాంగ్రెస్ పార్టీ సిగ్గుమాలిన చర్యఅన్నారు.దళితుల ఓట్లతో గద్దెనెక్కి ఇప్పుడు అదే ఎస్సీ/ ఎస్టీ వారిని అవమానించడం బిజెపి పార్టీ ఎస్సీ మోర్చా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు కొండేటి అనిత, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి సత్యం, సీనియర్ నాయకులు భూక్యా నాయక్, గిరిప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ లక్ష్యాలు చేరుకోవాలి

**-ఖమ్మం కలెక్టర్ ముజమిల్ ఖాన్**

**ఖమ్మం/మే15(జర్నలిస్ట్ వార్త):** జిల్లాలో ఆయిల్ పామ్ లక్ష్యాలు ను ప్రణాళికాబద్ధంగా చేరుకోవాలని కలెక్టర్ ముజమిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో ఆయిల్ పామ్ సాగు, వ్యవసాయ శాఖ పనితీరు పై అధికారులతో జిల్లా పాలనా అధికారి సమీక్షించారు. 8నెలలలో ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ దాదాపు రెండింతలు చేసుకోగలిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు తదితరులు ఉన్నారు.

# హైవే రోడ్ పై 3 ఎగ్జిట్ రోడ్ లు అందిన ఘనత సత్తుపల్లి నియోజకవర్గం దే

**-మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి**

**సత్తుపల్లి/మే15(జర్నలిస్ట్ వార్త):** దేశ చరిత్రలో లో ఎప్పుడు లేని విదంగా హైవే రోడ్ పై 3 ఎగ్జిట్ రోడ్ లు అందిన ఘనత ఒక్క సత్తుపల్లి నియోజకవర్గం దే అని మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి లు అన్నారు. గురువారం వేంసూరు మండలం, లింగపాలెం హైవే రోడ్ ఎగ్జిట్ నుండి కల్లూరు మండలం, లింగాల హైవే రోడ్ ఎగ్జిట్ వరకు హైవే రోడ్ పనులను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్. తుమ్మల మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఒక నియోజకవర్గం లో హైవే రోడ్ పై మూడు (3) ఎగ్జిట్ రోడ్ లో ఇవ్వటం ఇదే ప్రథమం అని ఆ ఘనత మీ సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే రాగమయి కి, సత్తుపల్లి నియోజకవర్గం ప్రజలకు దక్కుతుంది అని తెలిపారు. రైతుల కోసం అన్ని ప్రాంతాల్లో ఎక్సిట్ లు ఇవ్వాలి అని అధికారులకు తెలిపారు. 2 వ తారీకు కళ్ల హైవే రోడ్ పనులు పూర్తి చెయ్యలి అని తెలిపారు.. సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే





మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం లో హైవే పై 3 ఎక్సిట్ లు ఇచ్చినందుకు ధన్యవాదములు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కీ సహకరస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర మంత్రులు బట్టి కి, తుమ్మల కి, పొంగులేటి కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. తుమ్మల తో కలిసి హైవే రోడ్ పనులు పరిశీలించి, సత్తుపల్లి నియోజకవర్గం రైతు సోదరులతో మాట్లాడారు అనంతరం డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ రైతు సోదరులు సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు పువళ్ళ దుర్గా ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర గిద్దంగుల చైర్మన్ శ్రీ రావి నాగేశ్వరావు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు,సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ



ప్రభాకర్ చౌదరి, వైస్ చైర్మన్ లు, సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ పదవుల్లో యువనాయకత్వానికి అవకాశం కల్పించాలి.

**-జక్కి శ్రీకాంత్**

**వర్ధన్నపేట/మే15(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ పార్టీ పదవుల్లో యువనాయకత్వానికి అవకాశం కల్పించాలనివర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ చేసిన జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అన్నారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ఎ బి ఎస్ఫంక్షన్ హాల్ లో వర్ధన్నపేట పర్వతగిరి మండలాల కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ పరిశీలకులు ఎమ్మెల్సీ అమర్ అలీ



ఖాన్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ , నియోజకవర్గం పరిశీలకులు మేడి రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ యువజన అవార్డు గ్రహీత వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ వర్ధన్నపేట మండల అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడం జరిగింది.

ఈ సందర్భంగా జక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం పాటిస్తూ యువతకు అధిక ప్రాధాన్యతమిస్తూ సమర్థవంతమైన నైపుణ్యం గల విద్యావంతులకు పార్టీ పదవులు ఇవ్వడం ద్వారా పార్టీకి ఎంతో బలంగా తయారవుతుందని భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ నాయకత్వంలో యువనాయకత్వాన్ని పెంపొందించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రానున్న పది సంవత్సరాలు అధికారంలో ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ కార్యక్రమాలు, వ్యక్తిగత సమాచారాన్ని టిపిసిసి పరిశీలకులు ఎమ్మెల్సీ అమర్ అలీ ఖాన్ కి వర్ధన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి దరఖాస్తు ఫారం ను అందిచారు.

# నందమూరి తారక రామారావు విగ్రహం ఆవిష్కరించిన తనయుడు




**కల్లూరు/మే15(జర్నలిస్ట్ వార్త):**
నందమూరి తారక రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ హాజరయ్యారు. గురువారంసత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు,మండల పరిధిలోని యజ్ఞనారాయణపురం గ్రామంలో , దివంగత నెత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని నందమూరి తారక రామారావు తనయుడు నందమూరి రామకృష్ణ. ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లా, యజ్ఞా నారాయణపురం గ్రామంలో పల్లెటూరులోని ఏర్పాటు చేయటం గ్రామస్తులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం సినీ పరిశ్రమలో తనకంటూ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొని తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న నటీనటుడు నందమూరి తారక రామారావు అన్నారు. అన్న ఎన్టీఆర్ అనేక కార్యక్రమాలు చేసి పేరు ప్రఖ్యాతలు పొందిన అన్న



నందమూరి ఎన్టీఆర్ పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని ఆత్మవిశ్వాసం కలిగి ఉన్న నాయకుడు మన ఎన్టీఆర్ అన్నారు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపించి పేద ప్రజలకు రెండు రూపాయలకే కిలో బియ్యాన్ని అందించిన ఘనత ఎన్టీఆర్ దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ,కూరపాటి వెంకటేశ్వర్లు ,కేతినేని హరీష్ ,గుప్తా సీతయ్య , కూచిపూడి వెంకటేశ్వర్లు, రావూరి రవిప్రసాద్ ,పోతురాజు కృష్ణ ,వెంకటేశ్వర్లు, నారపోగు ప్రసాద్ బాబు,
సూర్యనారాయణ,(మాజీ సర్పంచ్), సామినేని నవీన్ కుమార్, సామాన్నేని రామకృష్ణ, ఆళ్ల కమలాకర్, మండపూడి సాయి, తదితరులు పాల్గొన్నారు.





# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**-మంద మహేష్ బీజేవైఎం కలాశాలాల విభాగం రాష్ట్ర కన్వీనర్**



**గణపురం/మే15 (జర్నలిస్ట్ వార్త):** అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరనిమంద మహేష్ బీజేవైఎం కలాశాలాల విభాగం రాష్ట్ర కన్వీనర్ అన్నారు. గురువారం జయశంకర్ జిల్లా ఘనపురం మండల పోలీసులు కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు విచ్చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా ముందస్తు అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీజేవైఎం కలాశాలాల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యా వైద్యం ఆరోగ్యం అనే ప్రజల యొక్క కనీస అవసరాలను మరిచిపోయి ప్రపంచ అందగత్తెల పోటీలు నిర్వహించడానికి ఉన్న సమయం చదువుకునే విద్యార్థుల ఫీజు రియంబర్మెంట్స్ అకాల వానలతో చేతికొచ్చిన పంటలను కోల్పోతున్న రైతులను పరామర్శించడానికి సమయం ఉండాదని ఎద్దేవ చేశారు సరస్వతి పుష్కరాలకు కోట్ల రూపాయల డబ్బుతో భక్తుల సౌకర్యాలకు పూర్తిస్థాయిలో నిర్మాణాలు కాకపోయినా ఆగమేఘాల మీద పుష్కరాలు నిర్వహిస్తు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుతున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్తారని అన్నారు.

# భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు






**కల్లూరు/మే15(జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మండలం పుల్లయ్య బంజరు రామాలయం సమీపంలో కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి తో ఆధారిత వ్యవసాయ పంటలు పండించుటకు భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, (పరిశీలికులు)విజయ భాస్కర్ రెడ్డి, భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ప్రకృతి వ్యవసాయంపై రైతు అవగాహచేశారు. పంటల ప్రాముఖ్యత, ప్రభుత్వము వలన రావలసిన, రైతుపథకాలను గురించి,క్షుణ్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కిసాన్ సంఘం అధ్యక్షులు వంగల శ్రీనివాసరావు, మరియు పుల్లయ్య బంజర గ్రామ రైతులు, బుర్రి వెంకట రామారావు, కృష్ణంశెట్టి నరసింహారావు, కురువెల కృష్ణమాచారి, వి రాంబాబు,తాండ లక్ష్మణరావు, నున్న లక్ష్మయ్య, పసుపులేటి మల్లేశ్వరరావు, బుర్రి రామకృష్ణ, నరసింహారావు, కిషోర్, రాధాకృష్ణ, బుర్రి కిరణ్,మొదలగు వారు పాల్గొన్నారు

# నిరుపేద చిన్నారి విద్యార్థుల దాతృత్వం

**-వేసవి దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ ,నిమ్మరసం పంపిణీ**









**సత్తుపల్లి/మే15(జర్నలిస్ట్ వార్త):** దాతృత్వ గుణం అలవర్చుకున్న ఈ నిరుపేద చిన్నారులు వేసవి సెలవుల్లో నిమ్మరసం, మజ్జిగ ఇచ్చి దాహార్తిని తీర్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు. స్థానిక గాంధీ నగర్ కు చెందిన (విశ్వశాంతి స్కూల్) 3,4, 5, 6 తరగతుల చిన్నారులు తమ వీధిలో రోడ్డు వెంట కర్రలతో ఓ చిన్న పందిరిలా ఏర్పాటు చేసి దానిపై పట్టాలు కప్పారు. తమ వద్ద గల పాకెట్ మనీతో బుధవారం పెరుగు కొనుగోలు చేసి దానితో మజ్జిగ తయారు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బుధవారం అటుగా వెళ్లే పారిశుద్ధ్య కార్మికులు, పాదచారులకు మధ్యాహ్నం వేళ మజ్జిగ అందజేసి దాహార్తిని తీర్చారు. చిన్నారుల దాతృత్వాన్ని గుర్తించి వారిని అభినందిస్తూ విశ్వశాంతి పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు , సత్యనారాయణ కొంత విరాళాన్ని అందజేశారు. ఆ మొత్తంతో నిమ్మకాయల రసం తయారు చేసి గురువారం మధ్యాహ్నం అటుగా వెళ్లే వారి దాహార్తిని తీర్చారు. మీకు ఈ ఆలోచన ఎందుకు కలిగిందని కొందరు అడగ్గా
గత ఏడాది గోదావరి , మున్నేరు వరద బాధితులకు పాఠశాలలో తమ తోటి విద్యార్థులతో కలిసి బియ్యం, డబ్బులు అందజేయడం జరిగిందని ఆ స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు కృతిక్ , వర్ధిని, , అజయ్, సంజయ్, రీణ వర్షిని, హర్షిని ,సారిక, విశ్వశాంతి టీచర్ మణి పాల్గొన్నారు.ం

# ఘనంగా వీరకోటి రెడ్డి కి జన్మదిన వేడుకలు





**దామరచర్ల/మే15(జర్నలిస్ట్ వార్త):** దామచర్ల మండలం లోని మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మిర్యాలగూడ బిఆర్ఎస్ కుందూరు వీరకోటి రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం దామరచర్ల మండలంలోని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా కేక్ కట్ చేసి స్వీట్ మిఠాయి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంల్లో నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా మొదలైన సరస్వతీ పుష్కరాలు







**భూపాలపల్లి/కాళేశ్వరం/మే15(జర్నలిస్ట్ వార్త):** కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోఛ్చారణలతో మారు మ్రోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో ఉదయం 5.44 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. గురువారం వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటి వరకూ సాంప్రాదాయానికే పరిమితమైన సరస్వతి పుష్కరాలు ఈ సారి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

**గణపతి పూజతో...**

గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో గురువారం ఉదయం 5.44 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభం అయ్యాయి. గోదావరి పుష్కరాల సమయంలో (వీఐపీ ఘాట్) సరస్వతి ఘాట్ లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆయన సతీమణీ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రేడింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు చేసిన తరువాత సరస్వతి నది పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు.

**పీఠాధిపతిచే...**

అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానలను కూడా నిర్వహించారు. శ్రీ గురుమదానానంద సరస్వతి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు. అనంతరం శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి, శ్రీ శుభానంద దేవి, సరస్వతి మాత ఆలయాలను ప్రముఖులు సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కరాలు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం గత కొన్ని రోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి.పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి మాతా అశీస్సులు పొందాలని సూచించారు.

# వర్షాకాలానికి ముందే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**





**హనుమకొండ/మే 15(జర్నలిస్ట్ వార్త):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా వర్షాలు పడక ముందే పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని గోదాంల వద్ద నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇప్పుడు వరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు, ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ఎన్ని మిల్లులు ట్యాగ్ అయి ఉన్నాయి. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు డబ్బులు జమా అవుతున్నాయా? ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఇంకా ఎన్ని గన్నీ బ్యాగులు ఉన్నాయి? ఒక్కో గన్ని బ్యాగుకు ఎంత ధర పడుతుందనే వివరాలను అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. మండలంలోని వీర నారాయణపూర్ లో తొలి విడత మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ గ్రామానికి చెందిన లబ్ధిదారులు సౌందర్య, సుశీల ఇండ్ల నిర్మాణానికి మెటీరియల్ ఎక్కడినుండి తీసుకు వస్తున్నారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చయిందని, ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒకే రేటు ప్రకారం చేస్తున్నారా లేదా అని లబ్ధిదారులతో మాట్లాడి కలెక్టర్ తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు బేస్ మెంట్ లెవెల్ వచ్చాయని, ఆ దశకు వచ్చిన వాటిని బిల్లు చెల్లింపు కోసం ఆన్లైన్ చేస్తున్నారా, ఈ గ్రామంలో ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయని, ఇంకా మొదలుపెట్టని ఇండ్లను ఎప్పటినుండి ప్రారంభిస్తారని గృహ నిర్మాణ శాఖ డి ఈ సిద్ధార్థ నాయక్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, జిల్లాలో ఇప్పటివరకు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు దాదాపుగా 150 కోట్ల రూపాయలను చెల్లించినట్లు పేర్కొన్నారు. రెండు వారాలలో మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా వీరనారాయణపూర్ లో మొదటి దశలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసి ఆన్లైన్ అయిన ఇండ్ల నిర్మాణాల లబ్ధిదారులకు బిల్లు చెల్లించడం జరిగిందన్నారు. వివిధ మహిళా వీవో గ్రూపుల ద్వారా లబ్ధిదారులు బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మిగతావి కూడా త్వరలో ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఇన్చార్జి జిల్లా అదనపు కలెక్టర్ మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శంఖుస్థాపన

**- రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ**





**వరంగల్/మే 15(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ పట్టణంలోని కృష్ణ కాలనీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర అటవీ దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాగురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సుమారు 7 దశాబ్దాల క్రితం బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా కళాశాలగా మంచి గుర్తింపు ఉన్న కృష్ణ కాలేజీ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. అందువల్లే నూతన భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ ముందుకు వచ్చి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద సుమారు 5 కోట్ల రూపాయలతో 3 అంతస్తుల్లో 15 తరగతి గతులతో పాటు 60 టాయిలెట్లను నిర్మిస్తున్నందున వారిని మంత్రి అభినందించారు. దీనితోపాటు ప్రభుత్వ పాఠశాలను సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో సీఎస్ ఆర్ క్రింద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల భవనానికి అవసరమగు మరమ్మత్తుల కొరకు తన నిధులు కేటాయిస్తానని, అందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో వరంగల్ ను రెండవ రాజధానిగా చేయుటకు కృత నిశ్చయంతో ముందుకెళుతున్నట్టు తెలిపారు. బల్దియా ఆధ్వర్యంలో శాశ్వతంగా డ్రైన్ నిర్మాణం చేపడతామని నగర మేయర్ ప్రకటించడం పట్ల మంత్రి అభినందించారు. భవిష్యత్తులో కృష్ణా కళాశాల వరద నీటి ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యల్లో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ క్రింద నుండి డ్రైన్ నిర్మాణానికి డి పి ఆర్ సిద్ధం చేయాలని, రైల్వే అధికారులతో సంప్రదించి పరిష్కారం చేస్తామని మంత్రి తెలిపారు.

**పునర్ వైభవానికి కృషి చేస్తున్న మంత్రికి కృతజ్ఞతలు**

కృష్ణా కాలనీ కళాశాల పునర్ వైభవానికి కృషి చేస్తున్న మంత్రి కొండ సురేఖకు నగర మేయర్ గుండు సుధారాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జీడబ్ల్యూఎంసి తరపున డ్రైన్ నిర్మానణానికి సహకారం అందిస్తామని తెలిపారు. 1982 ఇక్కడే ఇంటర్ చదువుకోన్నానని మేయర్ గుర్తు చేశారు. గతంలో ఆడపిల్లల చదువుకు ఇదే కళాశాల దిక్సూచిగా ఉండేదని, సైన్స్ విద్యార్థులకు చక్కని ల్యాబ్ సౌకర్యం ఈ కళాశాల సొంతమని తెలిపారు.

**మంత్రి చొరవతో కళాశాల భవనం నిర్మాణం సాధ్యమైంది**

కళాశాల భవన నిర్మాణం మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే సాధ్యమైందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. అరవిందో ఫార్మా వారితో పలుమార్లు సంప్రదించడం వల్లె సిఎస్ఆర్ కింద 5 కోట్ల రూపాయలతో కళాశాల భవనం నిర్మించడం సాధ్యమైందని అన్నారు. ఇతర కార్పొరేట్ సంస్థలతో సంప్రదించి త్వరలో ప్రభుత్వ పాఠశాలను కుడా సిఎస్ఆర్ క్రింద పునర్నిర్మానం చేయుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా షిఫ్టులవారీగా తరగతుల నిర్వహణకు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోనున్నట్లు తెలిపారు. కళాశాల భవన నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అరబిందో ఫార్మా ప్రతినిధులను కలెక్టర్ కోరారు. అనంతరం 10వ, తరగతిలో రాష్ట్రంలో ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థిని మంత్రి, మేయర్, కలెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, కావేటి కవిత బస్వరాజు, కుమార స్వామి, సురేష్ జోషి, అరబిందో ఫార్మా డైరెక్టర్ సదానంద రెడ్డి, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్ సుమన్, కళాశాల ప్రిన్సిపల్ శరదృతి తదితరులు పాల్గొన్నారు.

# ఆనంద్ దేవరకొండ కొత్త సినిమాకు క్లాప్ కొట్టిన రష్మిక



యువతలో మంచి ఆదరణ పొందిన 'బేబీ' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంట మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమైంది. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో ఓ సరికొత్త ప్రేమకథా చిత్రం రూపుదిద్దుకోనుంది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. 'నేషనల్ క్రష్' రష్మిక మందన్న ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ తొలి క్లాప్ కొట్టారు. నటుడు శివాజీ కెమెరా స్విచాన్ చేయగా, దర్శకులు వెంకీ అట్లూరి, కళ్యాణ్ శంకర్ చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంది. ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. యువతను ఆకట్టుకునేలా ఈ ప్రేమకథను తీర్చిదిద్దనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పలు విజయవంతమైన చిత్రాలకు సంగీతం అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూన్ నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని చిత్ర నిర్మాతలు తెలిపారు. 'బేబీ' చిత్రం తర్వాత ఆనంద్, వైష్ణవి జోడీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈ కొత్త సినిమా ఉంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని వారు వెల్లడించారు.

# అభిమాని బయోపిక్‌లో రామ్... 'ఆంధ్రా కింగ్ తాలూకా'గా టైటిల్ ఖరారు




యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన 22వ సినిమా టైటిల్‌ను అభిమానులతో పంచుకున్నారు. గురువారం రామ్ పుట్టినరోజు సందర్భంగా, ఈ చిత్రానికి 'ఆంధ్రా కింగ్ తాలూకా' అనే ఆసక్తికరమైన పేరును ఖరారు చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పి. మహేశ్ బాబు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. ఇందులో ఒక థియేటర్‌లో టికెట్ కౌంటర్ వద్ద ఉండే వ్యక్తి, వీఐపీల కోసం టికెట్లు కేటాయిస్తుండగా, రామ్ పోతినేని వచ్చి తనకు 50 టికెట్లు కావాలని అడుగుతారు. ఏ తాలూకా అని అడిగితే, "ఫ్యాన్స్" అని రామ్ చెప్పే డైలాగ్ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ సినిమా ఒక అభిమాని బయోపిక్ అని చిత్ర యూనిట్ తెలిపింది. "సాగర్ అనే అభిమాని జీవిత కథ ఇది. అభిమానులు సినిమాను ఆరాధిస్తారు, కానీ ఈ సినిమా అభిమానులనే ఆరాధిస్తుంది" అంటూ నిర్మాణ సంస్థ తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొంది. రామ్ పోతినేని ఈ చిత్రంలో సాగర్ అనే అభిమాని పాత్రలో కనిపించనున్నారు.

ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన సూర్య కుమార్ అనే సూపర్ స్టార్‌గా కనిపించనున్నారు. వీరితో పాటు రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వి.టి.వి. గణేష్ వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ సినిమాలో భాగం పంచుకుంటున్నారు.

నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోందని సమాచారం. సిద్ధార్థ నుని సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, వివేక్-మెర్విన్ ద్వయం సంగీతం సమకూరుస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.

# చీరందంలో మాళవిక!



కేరళ కుట్టీ మాళవిక మోహనన్ టాలీవుడ్ ఎంట్రీకి ముందే తెలుగు ఆడియన్స్ ని ఊపేస్తోంది. %-%రాజాసాబ్%-% తో టాలీవుడ్ లో లాంచ్ అవుతున్నా? ఆ సినిమా తో సంబంధం లేకుండా క్రేజీ బ్యూటీగా మారిపోతుంది. ఎప్ప టికప్పుడు కొత్త కొత్త ఘాటు పోజులతో ఇంటర్నెంట్ సంచనలంగా మారడంతోనే ఇది సాధ్యమైంది. మాలీవుడ్..బాలీవుడ్ లో ఎలాగూ క్రేజ్ ఉంది. ఆ క్రేజ్ సైతం టాలీవుడ్ కి కలిసొస్తుంది.

రెండు పరిశ్రమల్లో ఇప్పటికే గ్లామర్ గేట్లు తెరిచేసేంది. సందర్భం వచ్చినప్పుడల్లా చిచ్చర పిడుగులా చెలరేగుతుంది. క్లీవేజ్ అందాలతో...థైషోస్ తో యువతని ఆకర్షిస్తుంది. ఇన్ స్టాలో సంచలనంగా మారు తుంది. సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం చాలా అరుదు. తాజాగా అమ్మడు చీరందంలో తళుకులీన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. ఇందులో అమ్మడు బ్లాక్ అండ్ బ్లాక్ అమ్మడి స్కిన్ టోన్ తళత ళలాడిపోతుంది. చేతిలో మినీ హ్యాండ్ బ్యాగ్ అంతే హైలైట్ అవుతుంది. నలుపు రంగు చీరపై మ్యాచింగ్ అదే రంగు రవిక ధరించి హొయలు పోయింది. చేతిలో స్మార్ట్ ఫోన్ తో సెల్ఫీలు దిగుతూ రకరకాల భంగిమల్లో కెమారాకి ఫోజులిచ్చింది. పెదాలకు ఎర్రని లిప్ స్టిక్.. ఐబ్రోస్ మధ్య లో ఎర్రటి స్టికర్.. చెవులకు ధరించిన బులకాలు మాళవిక అందాన్ని రెట్టింపు చేసాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. మాళవిక సోషల్ మీడియా అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఆ సంగతి పక్కనబెడితే మాళవిక రాజాసాబ్ ఎప్పుడు రిలీజ్ అవుదుందా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది. కొంత మంది భామలు ఆన్ సెట్స్లో ఉండగానే రెండు..మూడు ఛాన్సులం దుకుంటే? ప్రభాస్ సరసన నటించినా మాళవికకు తెలుగులో కొత్త అవకాశాలు రాలేదు. అయితే బాలీవుడ్ లో మాత్రం ఛాన్సులు బాగానే అందుకుంటుంది.

# నా కథ సినిమాగా వస్తూ చూడాలని ఉంది: భజ్జీ



భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప బౌలర్లలో హర్భజన్ సింగ్ ఒకరు. తన స్పిన్ బౌలింగ్‌తో పాటు-, కీలక సమయాల్లో బ్యాటింగ్‌తోనూ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. 'టర్బనేటర్'గా పిలువబడే హర్భజన్ క్రికెట్ కెరియర్ సినిమాటిక్ గా ఉంటుందని దాన్ని వెండితెరపై చూపిస్తే వర్కవుట్ అవుతుందని కొందరి ఒపీనియన్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ తన జీవిత కథ సినిమాగా వస్తే చూడాలని ఉందన్నాడు. అంతేకాకుండా తన రోల్ కు పాత్రకు న్యాయం చేయాలని భావిస్తున్న ఇద్దరు హీరోల పేర్లను వెల్లడించాడు. అందుల్లో ఒకరు విక్కీ కౌశల్ మరొకరు రణవీర్ సింగ్. తన పాత్రకు వీరైతేనే బాగుంటుందని చెబుతున్నాడు. ఇప్పటికే కపిల్ బయోపిక్ 83లో రణ్ వీర్ సింగ్ కపిల్ దేవ్ గా కనిపించాడు. బహుశా ఇదే రన్వీర్ తన పాత్ర కూడా చేస్తే బాగుంటుందని భజ్జీ భావిస్తున్నాడేమో. గతంలో రణవీర్ సింగ్ '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో ఒదిగిపోయి, ఆ పాత్రను ఎంత అద్భుతంగా పోషించగలడో నిరూపించుకున్నాడు. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకపోయినా, రణవీర్ నటనకు మాత్రం ప్రశంసలు దక్కాయి. మరోవైపు, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంలో తన పాత్రలో సీరియస్ నెస్ ను చూపించాడు. బాక్సాఫీస్ వద్ద రూ. 600 కోట్లకు పైగా వసూలు చేసాడు. హర్భజన్ సింగ్ బయోపిక్‌లో తన పాత్రను ఎవరు పోషిస్తారో, ఆ చిత్రం ఎలా రూపుదిద్దుకుంటు-ందో చూడాలి. విక్కీ కౌశల్ తన ఇంటెన్సిటీతో కాని రణవీర్ సింగ్ తన ఎనర్జీతో భజ్జీ పాత్రలో మెప్పిస్తారో లేరో చూడాలి.

# రాజ్‌తో సమంత..

## సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు-న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామోంట్ లు విపడుతున్నాయి.

# సరిగమకు ది ప్యారడైజ్ ఆడియో హక్కులు




హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు 'ది ప్యారడైజ్' ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు- హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు- సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.

# బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు నమోదు



టాలీవుడ్ యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌పై హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌లో రాంగ్ రూట్‌లో వెళ్లడమే కాకుండా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించారంటూ ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీ వద్ద శ్రీనివాస్ తన కారులో రాంగ్ రూట్‌లో వచ్చాడంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, సదరు హీరోను ట్రాఫిక్ కానిస్టేబుల్ అడ్డుకుని హెచ్చరించారు. రాంగ్ రూట్‌లో ఎలా వస్తారంటూ కానిస్టేబుల్ ప్రశ్నించడంతో శ్రీనివాస్ అక్కడి నుంచి వెనక్కి వెళ్లిపోయారు. ఇక, ప్రస్తుతం ఈ యువ హీరో నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. భైరవం, టైసన్ నాయుడు, హైందవ, కిష్కింధపురి చిత్రాల్లో నటిస్తున్నారు.